ఈనాడు శ్రీ సత్యసాయి

సోమవారం అక్టోబరు 7, 2024



యజ్ఞహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

విశ్వశాంతిని కాంక్షిస్తూ యజ్ఞం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: విశ్వ శాంతిని కాంక్షిస్తూ వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞాన్ని ఆదివారం ప్రశాంతి నిలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల వేదఘోష భక్తుల సాయి నామస్మరణతో పులకించింది. ఏటా విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రశాంతి నిలయంలో యజ్ఞహోమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. సాయికుల్వంత్ ధ్యానమందిరంలో ఉదయం 7 గంటలకు వేదపండితులు మంగళవాయిద్యాలు, వేదపఠనం, స్వస్తి వాచకంతో ప్రతిష్ఠించిన కలశం వద్ద గణపతి పూజ చేశారు. ఆడిటోరియంలో ఉదయం 8.15 గంటలకు వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞాన్ని వేదపండితులు నిర్వహించారు. యజ్ఞ ద్రవ్యాలను అగ్నిహోత్రునికి సమర్పించారు. సాయంత్రం సాయి విద్యార్థులు వేదపఠనం పఠించారు. బెంగళూరు ముద్దనహళ్లి క్యాంపస్ విద్యార్థులు భక్తి కీర్తనలు ఆలపించారు. యజ్ఞం విశిష్టతను డాక్టర్ భాస్కరన్ భక్తులకు వివరించారు. ఏడు రోజులు పాటు సాగే యజ్ఞ హోమం, పూర్ణాహుతితో విజయదశమి రోజు 12వ తేదీన ముగుస్తుంది. కార్యక్రమంలో దేశ, విదేశాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



వేదం పఠిస్తున్న సాయి విద్యార్థులు

జగజ్జననీ.. వరప్రదాయిని

దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆదివారం కదిరిలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. జిల్లా అంతటా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వివిధ రూపాల్లో అమ్మవార్లు కొలువుదీరి భక్తులతో పూజలు అందుకుంటున్నారు.

- న్యూస్‌టుడే, కదిరి పట్టణం



జలాశయాల ఆయకట్టు..

- హంద్రీనీవా కోసం రైతన్నల ఎదురుచూపు
- ఎన్డీయే ప్రభుత్వంపైనే అన్నదాతల ఆశలు

నీరందితే ఒట్టు





మారాల రిజర్వాయరు

జిల్లా	నీటి సామర్థ్యం	జలాశయాలు	గుర్తించిన ఆయకట్టు
శ్రీసత్యసాయి	2.071 టీఎంసీలు	మారాల, చెర్లోపల్లి	23,500 ఎకరాలు

కదిరి, బుక్కపట్నం, న్యూస్‌టుడే: ఎడారిలో ఒయాసిస్సులా కరవునేలపై హంద్రీనీవా నీటి ఆధారంగా రెండు జలాశయాలను నిర్మించారు. 2014లో అధికారంలోకి వచ్చిన తెదేపా ప్రభుత్వం రిజర్వాయర్లను నింపింది. జలకళతో దుర్భిక్ష రైతుల కళ్లలో కాంతులీనాయి. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పిల్ల కాలువల నిర్మాణం పూర్తి చేయకపోగా పనులనే రద్దు చేసింది. ఫలితంగా వైకాపా పాలన ఆయకట్టుదారులకు శాపంగా మారింది. ప్రాజెక్టుల్లో నీరు పొలంలో పారలేదు. కానీ, పొరుగు జిల్లా పుంగనూరుకు హంద్రీనీవా నీళ్లు పరుగులు తీశాయి. కళ్లముందు నీరున్నా.. పంట సాగు చేయలేని రైతులు నిరాశకు లోనయ్యారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో ఆశలు చిగురించాయి. ఆయకట్టుకు పిల్ల కాలువల ఏర్పాటుపై కొత్తగా ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. హంద్రీనీవా జలాశయాలను నింపి తాగు, సాగునీరు అందిస్తామని చెబుతుండటంతో ఈసారైనా ఆయకట్టు పంటలతో కళకళలాడుతుందని ఎదురుచూస్తున్నారు.

2.071 టీఎంసీలు.. 23,500 ఎకరాలు

శ్రీసత్యసాయి జిల్లాలో రెండు జలాశయాలు నిర్మించారు. ఇందులో 0.463 టీఎంసీల నీటి సామర్థ్యం కలిగిన మారాల రిజర్వాయరు కింద 18 వేల ఎకరాలు, 1.608 టీఎంసీల సామర్థ్యం ఉన్న చెర్లోపల్లి జలాశయం కింద 5,500 ఎకరాలను ఆయకట్టుగా గుర్తించారు. మారాల జలాశయంతో సాగు నీరు అందిస్తే బుక్కపట్నం మండలంలోని మారాల, కృష్ణాపురం, ముదిగుబ్బ మండల పరిధిలో ముదిగుబ్బ, జొన్నలకొత్తపల్లి, మంగళమడక, గుంజేపల్లి ముక్తాపురం, చెర్లోపల్లి రిజర్వాయరుతో నల్లచెరువు మండలం తవలం మర్రి రెవెన్యూ గ్రామాల రైతులకు లబ్ధి చేకూరనుంది. ఆయకట్టు సాగవ్వాలంటే పిల్ల కాలువలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు అందుకు ఎలాంటి చర్యలు కనిపించలేదు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పదేళ్లుగా అగచాట్లు..



- నాగరాజు, మారాల రైతు

రిజర్వాయరు నిర్మించి పదేళ్లవుతోంది. ఇప్పటికీ చుక్క నీరివ్వలేదు. హంద్రీనీవా నీటితో పొలాలు పచ్చగా మారుతాయనుకున్నాం. గత ప్రభుత్వ పాలనలో నిధులు రాలేదని అధికారులు చేతులు ముడుచుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రైతులకు న్యాయం జరుగుతుందన్న ఆశాభావంతో ఉన్నాం.

ప్రభుత్వ ఆదేశాలతో ప్రతిపాదనలు

- మురళీకృష్ణ, హంద్రీనీవా ఈఈ

హంద్రీనీవా రిజర్వాయర్ల పరిధిలో ఆయకట్టుకు నీరందించే పిల్ల కాలువల నిర్మాణానికి ప్రభుత్వం ఆదేశాలిస్తే ప్రతిపాదనలు పంపుతాం. గతంలో మంజూరైన పిల్ల కాలువలకు భూసేకరణ లేదని, గిట్టుబాటు కాదని గుత్తేదార్లు పనులు చేయలేదు. దీంతో అప్పటి ప్రభుత్వం రద్దు చేసింది. ఎన్డీయే ప్రభుత్వం ఆదేశాలిస్తే కాలువల ఏర్పాటుకు కృషి చేస్తాం.

దిష్టిచుక్క పెట్టి

పసికందును బస్టాండులో వదిలివెళ్లిన మహిళ

దిక్కులేకుండా చేశావా అమ్మా..!



నిద్రిస్తున్న నన్ను లేపి స్నానం చేయిస్తే..
నా కోసమే కదా అని మురిసిపోయా
చేతినిండా గాజులు తొడిగి.. నుదుట బొట్టుపెడితే..
మా అమ్మ ఎంత మంచిదోనని సంబరపడ్డా..
మంచి దుస్తులు తొడిగి బస్టాండుకు తీసుకొస్తే..
అమ్మమ్మ ఊరికి వెళుతున్నామని గెంతులేశా..
అంతలోనే పని ఉందంటూ అనామకురాలి చేతిలో పెట్టిపోతే..
అమ్మే కదా.. వెంటనే వస్తుందులే అని ఎదురుచూశా..
కాలం కరిగిపోతున్నా.. ఎంతసేపటికీ నువ్వురాకపోయేసరికి..
పసికందునైన నేను పలువురి చేతులు మారుతున్నా.
ఎంతమంది ఊరడించి.. చేరదీస్తున్నా..
నీ పక్కనుంటే ఆ ఆనందమే వేరు కదమ్మా..
ఎవరి దిష్టి తగలకూడదని చుక్కపెట్టి తీసుకొచ్చి..
చివరికి.. దిక్కులేనిదాన్ని చేసి వెళ్లావా అమ్మా..

(ఓ వివాహిత కదిరి బస్టాండులో వదిలి వెళ్లిన ఐదు నెలల పసికందు ఆవేదనకు అక్షర రూపమిది)

కదిరి ఆర్టీసీ బస్టాండు ఆవరణలోనికి ఆదివారం ఐదునెలల పసికందుతో ఓ మహిళ వచ్చారు. మూత్ర విసర్జనకు వెళ్లాలంటూ ఓ బీటెక్ విద్యార్థినికి పాపను అప్పగించింది. గంటలు గడుస్తున్నా సదరు మహిళ తిరిగిరాలేదు. పరిసరాల్లో గాలించినా.. ఆమె ఆచూకీ తెలియలేదు. విద్యార్థిని వెళ్లాల్సిన బస్సు రావడంతో ఆమె డయల్ 100కు ఫోన్‌చేసి పసికందు విషయాన్ని తెలియజేసింది. సమాచారం అందుకున్న కదిరి పట్టణ పోలీసులు ఆర్టీసీ బస్టాండుకు చేరుకుని చిన్నారిని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. సమాచారం ఐసీడీఎస్ అధికారులకు తెలియచేసి పాపను వారికి అప్పగించారు. మరోవైపు చిన్నారిని తీసుకొచ్చిన మహిళ ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారు.. అనే కోణంలో ఆచూకీ కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. చిన్నారిని వదిలివెళ్లిన మహిళపై సుమోటాగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

– న్యూస్‌టుడే, కదిరి పట్టణం

ఇసుక నమోదు మరింత సులభతరం

పుట్టపర్తి, న్యూస్‌టుడే : నూతన విధానం ప్రకారం ఇసుక ఉచితంగా సులభంగా బుక్ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాండ్ బుకింగ్ పోర్టర్‌ను అమల్లోకి తీసుకొచ్చిందని, ఈ సదుపాయాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఒక ప్రకటనలో సూచించారు. పారదర్శకత, జవాబుదారి తనంతో ఉచిత ఇసుక పంపిణీ జరుగుతుందన్నారు. సీసీరేవులో 49,240, పీసీరేవులో వద్ద 45,729 మెట్రిక్ టన్నులు ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఉచిత ఇసుక పంపిణీ విధానం అమల్లో దరఖాస్తుదారుడు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, వ్యక్తిగతంగా కూడా దరఖాస్తు చేసుకోవచ్చనని వివరించారు.

87 దుకాణాలకు 132 దరఖాస్తులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే : నూతన మద్యం విధానం అమల్లో భాగంగా దుకాణాల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 87 దుకాణాలు ఉండగా ఆదివారం నాటికి 132 దరఖాస్తులు వచ్చాయి. స్వయంగా కార్యాలయాలకు వచ్చి దరఖాస్తు చేసి, సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. దరఖాస్తులను జిల్లా అధికారులు తనిఖీలు చేసి పరిశీలన చేస్తున్నారు. ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, 11న సాయిఆరామంలో డ్రా తీయడం జరుగుతుందని జిల్లా అబ్కారీ శాఖ ఏఈఎస్ నరసింహులు తెలిపారు.

వడ్డెర్ల అభ్యున్నతికి ఐక్యత చాటుదాం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో నాయకులు

కదిరి, న్యూస్‌టుడే : వడ్డెర్ల అభ్యున్నతికి ఐక్యత చాటుదామని వడియరాజుల ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చల్లా పిచ్చయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం కదిరిలోని ఎస్ఎంజేఎల్ డిగ్రీకళాశాలలో ఆ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వడ్డెర్లంతా ఐక్యంగా, సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం వడ్డెర్లలో వెనుకబడిన వారికి ఆర్థిక సాయం అందించాలని డిమాండు చేశారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా, కదిరి డివిజన్ వడియరాజుల ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా జేవీ రమణ, ప్రధాన కార్యదర్శిగా మల్లెల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కృష్ణయ్య, గౌరవాధ్యక్షుడిగా అశ్వర్థప్ప, సలహాదారుడిగా నారాయణ, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, గంగాధర్‌లను ఎన్నుకున్నారు. కదిరి డివిజన్ అధ్యక్షుడిగా మురళి, ప్రధాన కార్యదర్శిగా సోమశేఖర్, కోశాధికారిగా మునిస్వామి, గౌరవాధ్యక్షుడిగా శ్రీరాములు, సలహాదారులుగా వెంకటరమణ, రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, రమణ, వీరనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గోపాల్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, త్రిమూర్తి, వేణుగోపాల్, కుప్పయ్య, నాగేంద్ర, ఆది, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

పుట్టపర్తి, న్యూస్‌టుడే : శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (జీపీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న తెలిపారు. డివిజన్, మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ సంబంధిత అధికారులు వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నాన్ జ్యుడీషియల్ స్టాంపులకే మొగ్గు



జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మళ్లీ నాన్ జ్యుడీషియల్ స్టాంపుల అమ్మకాలు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ-స్టాంపింగ్ కాగితాల నాణ్యతపై అనేక ప్రశ్నలు ఉత్పన్నం కావడంతో పాత విధానంలోనే వెళ్లేందుకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు అవసరమైన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు తెప్పించడానికి జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు. నాసిక్ నుంచి వాటిని నేరుగా సరఫరా చేస్తే పాత పద్ధతిలోనే కౌంటర్లలో స్టాంపుల అమ్మకం ప్రారంభమవుతుంది. ప్రస్తుతం ఈ-స్టాంపులు, నాసిక్‌లో తయారయ్యే నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో కొన్ని కేంద్రాల్లో మాత్రమే ఈ-స్టాంపులు అందుబాటులో ఉన్నాయి. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మొత్తం 21 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో గతంలో అన్నిరకాల స్టాంపుల విక్రయం జరిగేది. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాసిక్‌లో తయారయ్యే స్టాంపుల విక్రయం పూర్తిగా ఆపేసింది. నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు కొనుగోలు చేయలేక వాటి అమ్మకాన్ని పూర్తిగా ప్రైవేటుపరం చేసిన ఘనత వైకాపాకే దక్కుతుంది. నకిలీ స్టాంపులు నిరోధించడానికే ఈ-స్టాంపుల విధానం అమల్లోకి తెచ్చినట్లు గతంలో గొప్పలు చెప్పుకున్నా.. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఈ-స్టాంపుల కన్నా నాసిక్‌లో తయారయ్యే స్టాంపులపైనే ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ సరఫరా చేస్తున్న ఈ-స్టాంపు కాగితాల నాణ్యత కూడా డొల్లగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటిపై అభిప్రాయాలు సేకరించింది. పాత విధానంలోనే స్టాంపుల అమ్మకం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే జరగాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో రెండు జిల్లాలకు సుమారు రూ.16 కోట్ల విలువైన స్టాంపులు కావాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే అవి అన్ని కార్యాలయాలకు సరఫరా అయ్యే అవకాశాలున్నాయి.

రూ.16 కోట్ల పత్రాల కొనుగోలుకు ప్రతిపాదనలు

ఈ-స్టాంపింగ్ పత్రాలకు అదనపు వసూళ్లు

ఉమ్మడి జిల్లాలో ఈ-స్టాంపింగ్ కాగితాలు అమ్మే సీఎస్‌సీ కేంద్రాలు, బ్యాంకులు, వెండర్లు సుమారుగా 130 మంది ఉన్నారు. ప్రస్తుతం అందరికీ స్టాంపు కాగితాలు సరఫరా చేయలేదు. వెండర్లకు అసలు సరఫరా చేయకపోవడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ద్వారా రెండు జిల్లాలకు కర్నూలు నుంచి ఈ కాగితాలు సరఫరా అవుతున్నాయి. ప్రస్తుతం ఒకటి రెండుచోట్ల మినహాయిస్తే అన్ని చోట్లా కాగితాల కొరత పీడిస్తోంది. కాగితాలు అందుబాటులో ఉన్న కేంద్రాల్లో ఒక్కో స్టాంపుపై రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. దస్తావేజు కూడా తమ దగ్గరే రాయించుకోవాలని నగరంలోని కామన్ సర్వీస్ సెంటర్‌లో షరతు పెడుతున్నారు. దీనిపై దస్తావేజు లేఖర్లు కూడా మండిపడుతున్నారు. కామన్ సర్వీస్ సెంటర్లపై అజమాయిషీ చేసే అధికారం రిజిస్ట్రేషన్లశాఖ అధికారులకు లేకపోవడంతో ఆడిందే ఆట.. పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు.

ప్రజల అభీష్టం మేరకు చర్యలు

నాన్‌జ్యుడీషియల్ స్టాంపులను అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విక్రయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తపాలా కార్యాలయాల్లో మిగిలిపోయిన స్టాంపులను వెనక్కి తెప్పించి విక్రయాలు చేయాలని నిర్ణయించాం. ప్రజల అభీష్టం మేరకే స్టాంపులను మళ్లీ కౌంటర్లలో విక్రయిస్తాం.

- భార్గవ్, జిల్లా రిజిస్ట్రార్

రైతులకు విద్యుత్తు సమస్యలు రానివ్వం



ఎన్ఎస్‌గేట్ విద్యుత్తు ఉపకేంద్రంలో రైతులకు నియంత్రికలు అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: పార్టీలకతీతంగా, సీనియార్టీ ప్రాతిపదికన రైతులకు వ్యవసాయ సర్వీసులు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని విద్యుత్తుశాఖ అధికారులను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. ఆదివారం రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పార్టీల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. రైతులకు విద్యుత్తు సమస్యలు రానివ్వకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఈఈ రాములు మాట్లాడుతూ విద్యుత్తు సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో డీఈఈ లక్ష్మీనారాయణ, ఏఈ వెంకటేశ్వర్లు, తెదేపా నాయకులు రామ్మూర్తినాయుడు, సుధాకర్, పరంధామయాదవ్, ముత్యాలరెడ్డి, రంగయ్య, ఓబిలేశు, మాడెం సూర్యనారాయణరెడ్డి, కిష్టప్ప, చెన్నకేశవగౌడ్ పాల్గొన్నారు.

జూదం ఆడుతూ పట్టుబడిన పురం వైస్ ఛైర్మన్

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణం హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆదివారం రాత్రి ఓ ఇంటిలో జూదం ఆడుతున్నారన్న సమాచారంతో పట్టణ రెండో పోలీస్‌స్టేషన్ సీఐ అబ్దుల్‌కరీం ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ వైకాపాకు చెందిన జబీవుల్లాతో పాటు పట్టణానికి చెందిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.38.100 నగదు స్వాధీనం చేసుకొని, సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీఐ వివరించారు.

రోగులకు రోడ్డుపైనే భోజనం పంపిణీ

సర్వజన వైద్యశాలలో ఇష్టానుసారంగా మెనూ అమలు



టీబీ చెస్ట్ వార్డు ఎదుట బయటే తోపుడుబండిపై రోగుల సహాయకులకు భోజనం వడ్డిస్తున్న గుత్తేదారు సిబ్బంది

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: ఆరోగ్యం బాగులేనివారికి సమయానుకూలంగా అల్పాహారం, భోజనం, మందులు అందిస్తే త్వరగా కోలుకునే పరిస్థితి ఉంటుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్యసేవలు పొందేందుకు చేరిన రోగులకు ప్రభుత్వమే ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజన సౌకర్యాన్ని ఉచితంగా కల్పిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను చేపట్టేందుకు గుత్తేదారును ఎంపిక చేసింది. కానీ, సదరు గుత్తేదారు రోగులకు పంపిణీ చేస్తున్న మెనూలో నాణ్యత అంత అంతమాత్రంగానే ఉంది. అలాగే రోగులకు వేళకు మెనూ అందజేయాల్సి ఉండగా ఇష్టం వచ్చినట్లు అమలు చేస్తున్నారు. టీబీ, చెస్ట్‌వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు సంబంధించి వార్డు ఆవరణలోకి వెళ్లి భోజనం వడ్డించాలి. కానీ, వార్డు ఎదురుగా రోడ్డుపైనే తోపుడుబండి నిలిపి భోజనం పంపిణీ చేస్తున్నారు. రోగులకు బయటకు రాలేరు. అందువల్ల వారి సహాయకులు ప్లేట్లు, ప్లాస్టిక్ డబ్బాలు చేతపట్టుకుని రోడ్డుపైకి వచ్చి అన్నంతోపాటు కోడి గుడ్డు, కూరలు పెట్టించుకుని వెళుతున్నారు. అన్ని పదార్థాలను ఒకేసారి కంచంలో వడ్డిస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారు. ఈవిషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నాణ్యతలో కోత.. నిధుల మేత

వైద్యశాలలో రోజువారీ సుమారు 1,000 నుంచి 1,200 మంది వరకు ఇన్‌పేషెంట్ (ఐపీ)లుగా సేవలు పొందుతున్నారు. వీరందరికీ ఒక తోపుడు బండిపై ఐదుగురు సిబ్బందితో మెనూ అందిస్తున్నారు. గుత్తేదారు సరఫరా చేస్తున్న మెనూ కంటే ఆసుపత్రి బయట స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పెడుతున్న భోజనం చాలా నాణ్యతగా ఉంటోందని రోగులు చెబుతున్నారు. నాసిరకంగా ఉంటున్నా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మెనూ అమలుకు సంబంధించి రోజువారీ ఆర్ఎంవోలతోపాటు డైటీషియన్లు పరిశీలించాల్సి ఉండగా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉదయం 7.30 నుంచి 8.30 గంటల వరకు అల్పాహారం, మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు భోజనం, రాత్రి భోజనం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు పంపిణీ చేయాలి. ఈ సమయాలకు అనుగుణంగా మెనూ పంపిణీ చేయడం లేదని రోగుల సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి అందించాల్సిన భోజనాన్ని ఆదివారం సాయంత్రం 5.10 గంటలకే సరఫరా ప్రారంభించడం గమనార్హం. గుత్తేదారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోకపోవడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ఈ విషయాన్ని సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా మెనూ అమలుకు సంబంధించి పర్యవేక్షణ పెంచుతామన్నారు. మెనూ నాసిరకంగా ఉంటే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. మెనూ అమలు ఆలస్యం కాకుండా చర్యలు చేపడతామని వివరించారు.

మెదడుకు పదును.. ప్రతిభకు పట్టం

• చదరంగంలో మెరుస్తున్న చిన్నారులు

హిందూపురం, న్యూస్‌టుడే: పదైదు సంవత్సరాలు నిండలేదు.. మెదడుకు పదును పెట్టారు.. బెంగళూరులో సెప్టెంబరు 22న నిర్వహించిన అంతర్జాతీయ ఫిడే రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరచి భళా అనిపించుకొన్నారు హిందూపురానికి చెందిన ఈ చిన్నారులు. భవిష్యత్తులో చదరంగంలో గ్రాండ్ మాస్టర్‌గా రాణించాలని.. చెస్‌లో ప్రపంచ చెస్ విజేతగా నిలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. దీనికి వీరు చేస్తున్న కృషి ఇప్పటి వరకు సాధించిన పతకాల వివరాలు వారి మాటల్లోనే..

ప్రపంచ ఛాంపియన్‌గా నిలవాలని ఉంది



పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాను. చిన్నప్పటి నుంచి చెస్ అంటే ఎంతో ఇష్టం. అందుకే ఇంట్లో అవకాశం ఉన్నప్పుడు చెస్‌ఆడుతూ మెలకువలు నేర్చుకొంటుంటాను. ఇప్పటి వరకు అండర్ 11 అనంతపురం రెండు దఫాలు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రాణించాను. అంతర్జాతీయ ఫిడే రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపి 1532 రేటింగ్ సాధించటం నా జీవితంలో మరచిపోని సంఘటన. భవిష్యత్‌లో మరింత శ్రమించి పపంచ చాంపియన్ నంబర్‌వన్‌గా నిలవాలని ఉంది.

- జి.జ్ఞాపికారెడ్డి, మార్కండేయనగర్, హిందూపురం

ప్రపంచ చెస్ విజేతగా నిలుస్తా..

-సీఎన్‌పీ మిథున్‌పెద్దన్న, బాపూజీనగర్, హిందూపురం



పట్టణంలోని దీప్తి పాఠశాలలో 7వ తరగతి చదువుతూ స్థానికంగా స్పార్టన్ చెస్ అకాడమిలో రెండేళ్ల నుంచి శిక్షణ పొందుతున్నాను. ధర్మవరంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో, కర్నూలు, విజయవాడలో ఈ సంవత్సరం నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి 20 పతకాలు సాధించాను. చెస్‌లో రాణించిన ప్రజ్ఞానంద స్ఫూర్తిగా తీసుకొని ప్రపంచ చెస్ విజేతగా నిలవాలని కృషి చేస్తున్నాను. అంతర్జాతీయ ఫిడే రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో 1455 రేటింగ్ సాధించటం ఎంతో గర్వంగా ఉంది.

గ్రాండ్ మాస్టర్‌గా రాణించాలని ఉంది

-విష్ణుకిరణ్, మోతుకపల్లి



నాకు చెస్‌లో రాణించి గ్రాండ్‌మాస్టర్ కావాలని ఉంది. అందుకే ప్రతి రోజూ దాదాపు గంటకుపైగా దీనిపై కోచ్ వద్ద శిక్షణ పొందుతూ మెలకువలు నేర్చుకొంటున్నాను. ప్రస్తుతం 9 తరగతి చదువుతున్న నేను చదువు లోనూ రాణిస్తున్నాను. పెనుగొండ, అనంతపురం పట్టణాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి పతకాలు పొందాను, అంతర్జాతీయ ఫిడే రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరచి 1463 రేంటింగ్ సాధించటం నాకు ఎంతో ఆనందంగా ఉంది.

జీబీసీకి గండి.. సాగునీరు వృథా

విడపనకల్లు (ఉరవకొండ), న్యూస్‌టుడే: గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ)కి 28.5 కి.మీ. వద్ద గండి పడింది. డొనేకల్లు వంకపై ఉన్న జీబీసీ అండర్ టన్నెల్ శిథిలావస్థకు చేరుకుని స్లాబ్ కూలింది. ఈ ఘటన రెండు రోజుల కిందటే జరిగింది. దిగువ ఆయకట్టుకు నీరు రావడం లేదని పలువురు రైతులు పరిశీలించుకుంటూ కాలువపై రావడంతో వెలుగు చూసింది. గండి పడటంతో సాగునీరు మొత్తం వంక పాలవుతోంది. దీని కారణంగా ఆయకట్టు నీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. గత నెలలో నాలుగో కి.మీ. వద్ద కూడా అండర్ టన్నెల్ రక్షణ గోడ కూలిపోయి దాదాపు 20 రోజులు నీటి ప్రవాహం ఆగిపోయింది. ఇప్పటికే విడపనకల్లు మండలం గడేకల్లు, పాల్తి, పెంచలపాడు గ్రామాల పరిధిలోని ఆయకట్టుకు నీరు సరిగా సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు పనులను వేగంగా చేయించాలని రైతులు కోరుతున్నారు. దీనిని మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లగా, మరమ్మతులు పనులు త్వరగా పూర్తి చేయిస్తామని తెలిపారని తెదేపా నాయకుడు గడేకల్లు శీన తెలిపారు. గండి పడిన ప్రదేశాన్ని గుర్తించామని, ఉన్నతాధికారులకు తెలిపి మరమ్మతు పనులను చేపట్టనున్నట్లు జీబీసీ డీఈఈ రమణ రెడ్డి పేర్కొన్నారు.



వంకలోకి ప్రవహిస్తున్న నీరు

సంతల ఆదాయం రూ.4.83 లక్షలు

అనంత మార్కెట్‌యార్డు, న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని శని, ఆదివారం సంతల్లో రూ.4,83,840 ఆదాయం వచ్చింది. అందులో గొర్రెలు, మేకల సంతలో రూ.2,70,540 రాగా, పశువుల సంతలో రూ.2,13,300 ఆదాయం వచ్చిందని, యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

టమాటా కిలో రూ.52

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణం కక్కలపల్లి మార్కెట్‌లో టమాటా ధరలు తగ్గాయి. ఆదివారం మొత్తం 18 మండీలకు 675 టన్నులు వచ్చాయి. కిలో గరిష్ఠంగా రూ.52, మధ్యస్థం రూ.40, కనిష్ఠం రూ.30 చొప్పున ధరలు పలికాయి. 15 కిలోల బుట్ట ధర గరిష్ఠం రూ.780, మధ్యస్థం రూ.600, కనిష్ఠం రూ. 450 చొప్పున ధరలు పలికాయని మార్కెట్ ఇన్‌ఛార్జి రాంప్రసాద్‌రావు తెలిపారు.

ఘనంగా మాదిగల ఆత్మీయ కలయిక

• రక్త దాతలకు ధ్రువపత్రాల అందజేత

పెనుకొండ,న్యూస్‌టుడే: స్థానిక త్రిపురా రిసార్ట్స్‌లో ఆదివారం మాదిగల ఆత్మీయ కలయిక 9వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ సునీల్‌కుమార్ చావలి హాజరయ్యారు. మాదిగలు అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదిగేందుకు సహకరించుకోవాలని వక్తలు మాట్లాడారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 8మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు ఆర్టీఐ కమిషనర్ ఆధ్వర్యంలో ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం త్రిపురారిసార్ట్స్ యజమాని, భాజపా సభ్యత్వ నమోదు బాధ్యుడు గోపీనాథ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఎంఏకే ఫౌండేషన్‌కు రూ.25వేలు చెక్ అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు అజిత్‌కటికల, కార్యదర్శి త్రివిక్రమ్, నాయకులు ఉలవల నాగరాజు పోతులయ్య, ఆశావాది సుధామకీర్తి, 23 జిల్లాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



భాజపా సభ్యత్వ నమోదు బాధ్యుడు గోపీనాథ్‌ను సత్కరిస్తున్న నాయకులు

‘రైతుకు నష్టం కలిగిస్తే సహించం’

బత్తలపల్లి: రైతుకు నష్టం కలిగించే పని ఏ పార్టీ వారు చేసినా సహించేది లేదని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన స్పష్టం చేశారు. బత్తలపల్లి మండలం తంబాపురంలో జనసేన పార్టీ నాయకులు రమణారెడ్డి పొలంలో 53 చీనీ చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి నరికివేశారు. విషయం తెలుసుకున్న చిలకం మధుసూదనరెడ్డి మండల నాయకులతో కలసి ఆదివారం తంబాపురం వెళ్లి నరికిన చీనీచెట్లను పరిశీలించారు. రెండు సంవత్సరాలకుపైగా రైతు కష్టపడి పెంచుకున్న చెట్లను నరికివేయడం చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పని ఏ పార్టీ నాయకులు చేసినా సహించేది లేదని రాబోవు రోజుల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠినమైన చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కన్వీనర్ రవి, భాజపా మండల కన్వీనర్ వీరనారప్ప, తదితరులు పాల్గొన్నారు.



బాధితుడి పొలంలో నరికివేసిన చీనీచెట్లు పరిశీలిస్తున్న చిలకం మధుసూదన్



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న రచయిత, సాహితీ వేత్తలు

వ్యవస్థ లోపాలను ప్రశ్నించే కథలు రావాలి

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించే విధంగా కథలు రావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం అనంతపురంలోని ఎన్జీఓ హోంలో ఎస్కేయూ విశ్రాంత ఆచార్యులు రెడ్డెప్పరెడ్డి రచించిన చెరువు గండి జననాయక జయహే ది గ్రేట్ డిక్లైన్ కథల పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కథల పుస్తకాన్ని సమీక్ష చేసిన ప్రముఖ విమర్శకులు వేణుగోపాల్ ప్రసంగిస్తూ పేదలను మార్కెట్ మాయాజాలం ఎలా పిప్పి చేస్తుందో, పేదలు ఎలా దోపిడీకి గురవుతారో కథలో చక్కగా వివరించారన్నారు. ప్రపంచ సంక్షోభం వెనుక దాగి ఉన్న సమస్యల గురించి రాయడం రచయిత ముందు చూపునకు నిదర్శనం అన్నారు. ఎవరు ఆలోచించని అంశాన్ని ఎంపిక చేసుకొని నవల రాయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణస్వామి, రచయిత శాంతినారాయణ, అరసం అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, డాక్టర్ నానీల నాగేంద్ర పాల్గొన్నారు.

పరిహారం ఇప్పిస్తామంటూ మోసం

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: మరణ పరిహారం ఇప్పిస్తానంటూ బాధిత కుటుంబానికి అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫోన్ చేసి ఆన్‌లైన్‌లో నగదు వేయించుకున్నాడు. ఈ ఘటన మండలంలోని మేడాపురం గ్రామంలో ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు నాగేంద్ర అప్పుల బాధ తాళలేక గత నెల 30న ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన భార్య మౌనిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అదే గ్రామానికి చెందిన సూరి, మృతుని సోదరుడు ముత్యాలుకు ఫోన్ చేసి తనకు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ తెలుసని, ఆయన రైతు మరణం అని ధ్రువీకరిస్తే రూ.6 లక్షలు పరిహారం మంజూరవుతుందని నమ్మబలికాడు. కాన్ఫరెన్స్ కాల్ కలిపి వేరే వ్యక్తితో మాట్లాడించాడు. వారి మాటలు నమ్మిన ముత్యాలు ఫోన్ పే ద్వారా రూ.18,160 బదిలీ చేశారు. కాసేపటికి సదరు ఫోన్ నంబర్ పని చేయకపోవడంతో అనుమానం వచ్చి సూరికి ఫోన్ చేశారు. నగదు ఎవరు వేయమన్నారని, దానికి నేను బాధ్యత వహించలేనని అతడు చేతులెత్తేశాడు. చేసేదిలేక బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కమిటీల మధ్య విభేదాలు వద్దు: మంత్రి

పెనుకొండ: వెంకటగిరిపాళ్యం పరిధిలోని కోన కన్వాశ్రమంలో కమిటీల మధ్య విభేదాలు ఉండకూదని, భక్తుల సమక్షంలో అభివృద్ధి పనులు నిర్వహించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సూచించారు. ఆదివారం కోనలోని మల్లికార్జునస్వామి ఆలయంలో మంత్రి సవిత, పార్టీశ్రేణులతో కలసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలోని రెండు కమిటీల మధ్య ఉన్న విభేదాల కారణంగా ఆలయ అభివృద్ధి, నిర్వహణ కుంటుపడుతోందని భక్తులు సమావేశం నిర్వహించడంతో గతంలో జరిగిన అంశాలపై చర్చించారు. 50 ఏళ్లుగా పీఠాధిపతిగా ఉన్న విష్ణుదాసస్వామి మూడేళ్ల క్రితం మృతిచెందారు. ఆయన మరణాంతరం భక్తుల సమక్షంలో పీఠాధిపతిగా చంద్రస్వామిని నియమించారు. భక్తుల్లో విభేదాలు రావడంతో గత ప్రభుత్వ పాలనలో అక్కడ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఏర్పాటు చేయడంతో, రెండు కమిటీల మధ్య తరచు గొడవలు పడడంతో అభివృద్ధికుంటుపడింది. ఆదివారం మంత్రి సవిత ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీధర్, సీఐ రాఘవన్, భక్తాదులతో కలసి చర్చించారు. ఆశ్రమపీఠాధిపతిగా చంద్రస్వామిని కొనసాగించేలా, బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును కోనకన్వాశ్రమం పేరుతో బ్యాంకు ఖాతా ఏర్పాటు చేసి, ఆలయభూములు సైతం ఆశ్రమం పేరు మీదే ఉంచేలా, 6నెలలకోసారి భక్తులు, గ్రామస్థులు సమక్షంలో ఆడిట్‌చేసే విధంగా తీర్మానించారు.



కమిటీల రద్దు పై చర్చిస్తున్న మంత్రి సవిత, అధికారులు

‘నడిమిదొడ్డి చౌక దుకాణంలో అక్రమాలు’

నార్పల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామంలో రేషన్ దుకాణంలో గత 5 నెలలుగా లెక్కకు మంచి అక్రమాలు జరిగాయని, ఇది తమ పరిశీలనలో తేలిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఓ.నల్లప్ప ఆరోపించారు. ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ డీలర్‌ను కచ్చితంగా మారుస్తారని గ్రహించిన పాత డీలరు 5 నెలలుగా 560 కిలోల జొన్నలు కార్డు దారులకు ఇచ్చామంటూ 560 కిలోల బియ్యం కోటా తగ్గించి ఇచ్చారన్నారు. బియ్యంతో పాటు, జొన్నలు కూడా లబ్ధిదారులకు సక్రమంగా ఇవ్వకుండా పక్కదారి పట్టించారన్నారు. గ్రామంలో మొత్తం 626 మంది కార్డులు ఉండగా 26 శాతం మంది రేషన్‌కార్డు లబ్ధిదారులకు బియ్యమే వేయలేదన్నారు. మిగిలిన బఫర్ బియ్యం స్టాకును పక్కదారి పట్టించారన్నారు. పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అప్పటికైనా చర్యలు తీసుకోకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: మహిళా రైతు మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు లాక్కెళ్లారు. ఈ ఘటన చెన్నేకొత్తపల్లి మండలంలోని న్యామద్దల గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల వివరాల మేరకు.. న్యామద్దలకు చెందిన వెంకటరెడ్డి, తన భార్య శైలజతో కలిసి పొలం పనులు ముగించుకుని సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని ముగ్గురు దుండగులు వారిని అడ్డగించారు. వెంకటరెడ్డిపై దాడి చేసి భార్య మెడలోని మూడు తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. గొలుసు విలువ రూ.2.20 లక్షలు అని బాధితులు వాపోయారు. సీకేపల్లికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

త్వరలో శ్రీశైలానికి బస్సు సర్వీసు

కదిరి, న్యూస్‌టుడే : కదిరి డిపో నుంచి త్వరలో శ్రీశైలానికి బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రజా రవాణా జిల్లా అధికారి మధుసూదన్ తెలిపారు. ఆదివారం కదిరి ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించారు. భక్తుల సౌకర్యార్థం శ్రీశైలానికి బస్సు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా బస్టాండు ఆవరణంలోని ప్రయాణికుల సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీఎం హరిత, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగసుబ్బయ్య, ఎన్‌ఎంయూఏ నాయకులు ఎన్వీ రమణ, హరిమోహన్, బైరిశెట్టి, రామచంద్ర, సురేంద్ర, కార్గో సూపర్‌వైజర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండులో సదుపాయాలు పరిశీలిస్తున్న జిల్లా అధికారి మధుసూదన్

భగీరథ కల్యాణ మండప స్థలంపై వివాదం

• పరిశీలించిన ఆర్డీవో, డీఎస్పీ

సోమందేపల్లి, న్యూస్‌టుడే: సోమందేపల్లి అక్కమ్మకొండ పక్కన ఉప్పర/సగర సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న భగిరథ కల్యాణ మండపం స్థలంపై వివాదం నెలకొంది. ఇక్కడున్న మొత్తం 59 సెంట్ల స్థలంలో రూ.కోటి ఎంపీ నిధులతో భగిరథ కల్యాణ మండపం భూమి పూజ కార్యక్రమానికి సోమవారం ఉదయం ఎంపీ బీకే పార్థసారథి రానున్న నేపథ్యంలో మంత్రి ఎస్.సవిత వర్గీయులు ఆదివారం సాయంత్రం స్థలం వద్దకు చేరుకొని పనులను అడ్డుకొన్నారు. దీంతో వివాదం తలెత్తడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో చివరకు సోమవారం నిర్వహించనున్న కల్యాణ మండపం భూమి పూజ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆర్డీవో ఆనంద్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు సంఘం నాయకులకు తెలియజేశారు. ఈ సమాచారంతో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్, తమ సిబ్బంది, ప్రత్యేక పోలీసులు చేరుకొని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు చేపట్టారు. ఆర్డీవో ఆనంద్‌కుమార్, స్థానిక ఉప తహసీల్దార్లు రెడ్డిశేఖర్, గంగాశంకర్, సర్వేయర్ వినోద్‌కుమార్, రెవెన్యూ అధికారులు నాగరాజు తదితరులతో కలసి చేరుకొని స్థలాన్ని పరిశీలించి, ఉప్పర/సగర సంఘం నాయకులు గోపాల్, రామచంద్ర తదితరుల వద్దనున్న స్థలం హక్కు పత్రాలను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయ రికార్డులను పరిశీలించాక, సర్వేయర్, రెవెన్యూ అధికారులతో మొత్తం స్థలాన్ని సర్వే చేయించారు. సంఘం నాయకుల వద్దనున్న భూ పత్రాలకు, అక్కడున్న స్థలం కొలతల్లో తేడా ఉండటంతో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉందని, త్వరలోనే ఈ స్థలం సమస్యను చట్టప్రకారం త్వరలోనే పరిష్కరించ నున్నట్లు ఆర్డీవో విలేకరులకు వివరించారు.



సోమందేపల్లి: వివాదంగా మారిన స్థలం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో ఆనందకుమార్ , పక్కన డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు

పోగొట్టుకున్న నగల అందజేత


తాడిపత్రి, న్యూస్‌టుడే : ఓ ఆటోలో బంగారు నగల సంచిని పోగొట్టుకున్న దంపతులకు వాటిని గుర్తించి పట్టణ పోలీసులు ఆదివారం అందజేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాడిపత్రి రైల్వేస్టేషన్ నుంచి అనంతపురం వెళ్లేందుకు ఓ ఆటోలో ఎక్కి వచ్చారని, దిగే హడావుడిలో తమ వద్ద ఉన్న బంగారు నగల సంచిని అందులోనే మరిచిపోయారు. ఆటోముందుకు వెళ్లిపోయింది. తరువాత సంచి పోయిందని తెలుసుకున్న బాధితులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేసి ఆటోను గుర్తించి అందులో ఉన్న సంచిని అందజేశారు. సుమారుగా ఐదు తులాల వరకు ఉన్న బంగారు నగలను పోలీసులు దంపతులు గురుప్రసాద్, వాణీలకు అందజేసినట్లు తెలిపారు.



నగల సంచిని అందజేస్తున్న పట్టణ పోలీసులు

ఉరేసుకొని ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య


గుంతకల్లు, గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : గుంతకల్లు ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న డ్రైవర్ రహంతుల్లా (55) ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారని గ్రామీణ ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రహంతుల్లా పొట్టి శ్రీరాములురోడ్డు కాలనీలో నివాసం ఉంటున్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సెలవులో ఉన్నారన్నారు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. పాతకొత్తచెరువు గ్రామం వద్ద ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



రహంతుల్లా

పిడుగు పడి గొర్రెల కాపరి మృతి

శింగనమల : శింగనమల కలిగొంది కొండల మధ్య ఆదివారం రాత్రి పిడుగు పడి శంకర్(27) అనే గొర్రెల కాపరి మృతి చెందారు. స్థానిక బోయ వీధికి చెందిన కాపరి వర్షం పడుతున్న సమయంలో చెట్టు కిందకు వెళ్లారు. ఉరుములు, మెరుపులో కూడిన వర్షం పడింది. చెట్టుపై పిడుగు పడటంతో అక్కడే ఉన్న కాపరి అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామానికి చెందిన బొజ్జప్పకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నారు. రెండో కుమారుడు శంకర్ కొన్నేళ్లుగా గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నారు. చిన్న కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల బోరున విలపించారు. సీఐ కౌలుట్లయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



శంకర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

• ఆరుగురికి తీవ్ర గాయాలు

• కుంగిన రోడ్డులో అదుపు తప్పిన వాహనం

లేపాక్షి, హిందూపురం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షి మండలంలోని చోళసముద్రం జాతీయ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. లేపాక్షిలోని బ్రహ్మకుమారీ ఆశ్రమంలో ఉంటున్న 8 మంది సభ్యులు ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు కారులో మడకశిర వెళ్లారు. అక్కడ కార్యక్రమం ముగించుకొని తిరుగు ప్రయాణంలో చోళసముద్రం జాతీయ రహదారి కూడలికి కూతవేటు దూరంలో రోడ్డు కుంగడంతో వేగాన్ని అదుపు చేయలేక కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న బిసలమానేపల్లికి చెందిన ఎ.సరస్వతమ్మ(57), చిలమత్తూరు మండలం చినగానిపల్లికి చెందిన నారాయణమ్మ(65), లేపాక్షికి చెందిన అంజినప్ప, శశాంక్, సరస్వతమ్మ, బిసలమానేపల్లికి చెందిన నారాయణమ్మ, లక్ష్మమ్మ, కర్ణాటక రాష్ట్రం నగరిగెరకు చెందిన రాజేశ్వరిలకు తీవ్ర గాయాల్యయాయి. వెంటనే స్థానికులు వీరందరినీ జాతీయ రహదారి అంబులెన్స్‌లో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే బిసలమానేపల్లికి చెందిన ఎ.సరస్వతమ్మ, చిలమత్తూరు మండలం చినగానిపల్లికి చెందిన నారాయణమ్మలు మృతి చెందారు. మిగిలిన ఆరుగురిలో లక్ష్మమ్మకు స్థానికంగా చికిత్సలు అందిస్తున్న వైద్యులు అంజినప్ప, శశాంక్, సరస్వతమ్మ, నారాయణమ్మ, రాజేశ్వరీలను మెరుగైన వైద్యం కోసం అనంతపురం, బెంగళూరు ఆస్పత్రులకు తరలించారు. ఆసుపత్రి ప్రాంగణలో మృతుల కుటుంబీకుల ఆర్తనాదాలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, తెదేపా జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మండల కన్వీనర్ జయప్ప బాధితులను పరామర్శించి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి వెంటనే వైద్యం అందేలా ఆసుపత్రి సూపరింటెండెంట్ లింగన్న చర్యలు తీసుకొన్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



సరస్వతమ్మ

హైవే అథారిటీ అధికారుల నిర్లక్ష్యంతోనే..

హైవే అథారిటీ అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు. చోళసముద్రం వద్ద జాతీయ రహదారిపై కారు బోల్తా పడిన పక్కనే పాడుబడిన బావి ఉంది. దీంతో రహదారి తరచూ కుంగి పోతోంది. విషయాన్ని అధికారులకు స్థానికులు తెలిపినా నాసిరకంగా పనులు చేసి చేతులు దులుపుకొన్నట్లు విమర్శలున్నాయి. సాయంత్రం డీఎస్పీ మహేశ్, హిందూపురం గ్రామీణ అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

మానవాళి మనుగడకు పర్యావరణ పరిరక్షణే మార్గం


ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: మానవాళి మనుగడకు పర్యావరణాన్ని పరిరక్షించడమే మార్గమని పర్యావరణ వేత్త భాస్కర్‌రెడ్డి, ఐఎఫ్‌ఎస్ కార్యదర్శి కృష్ణమూర్తి, రీజినల్ కో ఆర్డినేటర్ చెన్నకేశవులు నాయక్‌లు పేర్కొన్నారు. ఆదివారం కొడిగెనహళ్లిలో పర్యావరణ పరిరక్షణపై చైతన్య ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బయాలజీ ఉపాధ్యాయులు రామలింగయ్య, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామరెడ్డి జయంతి

మడకశిర (గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీరామరెడ్డి 119వ జయంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద కర్ణాటక ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ సత్యవతి, మడగిరి సబ్ కలెక్టర్ శివప్ప, మాజీ మంత్రి రఘువీరారెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన జయంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన సూర్యవిద్యాని కేతన్ జట్టుకు ట్రోఫీ అందజేశారు. అలాగే పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉత్తమ రైతులకు బహుమతులు అందజేశారు.


ట్రోఫీ అందుకున్న జట్టుతో సత్యవతి, శివప్ప, రఘువీరారెడ్డి తదితరులు

మూడు చక్రాల సైకిల్ అందజేత

గోరంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని పాలసముద్రం దళితవాడకు చెందిన దివ్యాంగుడైన అనాథ సామాజిక సేవకర్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు జగదీశ్వర్ ట్రైసైకిల్ గుమ్మయ్యగారిపల్లి కూడలిలో అందజేశారు.

ఎస్సైల బాధ్యతల స్వీకరణ

గోరంట్ల: గోరంట్ల పోలీసుస్టేషన్ నూతన ఎస్సైగా శ్రీనివాసులు ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

హిందూపురం: పట్టణ రెండో పోలీస్ స్టేషన్ ఎస్సైగా అబ్దుల్‌కలామ్‌ఆజాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

మడకశిర: నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు గ్రామీణ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యంగా కర్ణాటక మద్యం, ఇసుక అక్రమ రవాణా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశామన్నారు.

చోరీ చేసేందుకు వచ్చి మృతి

హిందూపురం: కర్ణాటక ప్రాంతం హోసదుర్గం సమీపంలో గంజిగెర గ్రామానికి చెందిన ఆర్.లోకేశ్(43) ఇళ్లల్లో దొంగతనాలు పాల్పడేందుకు హిందూపురం ప్రాంతానికి వచ్చి శనివారం రాత్రి శిర జాతీయ రహదారి కొల్లకుంట స్టేజీ వద్ద మృతి చెందాడు. ఇతని మృతదేహాన్ని ఆదివారం గుర్తించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో మృతదేహాన్ని పరిశీలించి అతని వద్ద దొరికిన ఆధారాలతో అతను గంజిగెర గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. దొంగతనాలు చేసేందుకు ఇక్కడికి వచ్చినట్లు విచారణలో వెల్లడైనట్లు ఏఎస్సై ఆదినారాయణ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆసుపత్రిలో..

సోమందేపల్లి: స్థానిక జాతీయ రహదారి పక్కన గాయాలతో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి అనంతరం ఆసుపత్రిలో మృతి చెందాడు. పోలీసులు తనకు సంబంధించి ఏఎస్సై మురళీమోహన్ కథనం మేరకు.. ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి (43) శరీరంపై గాయాలతో జాతీయ రహదారి విభాగిని వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. రహదారి వాహన పోలీసులుపెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆవ్యక్తి మృతి చెందాడు. మృతుడు దరించిన చొక్కాపై ఉన్న టీసెంట్ టైలర్, సిర్పూర, కర్ణాటక అని చిరునామాలో అక్కడి పోలీసులు సంప్రదించిన మృతుని వివరాలు తెలియలేదని ఏఎస్సై చెప్పారు.

వృద్ధుడి ఆత్మహత్య

అమరాపురం: హేమావతి గ్రామంలో మల్లప్ప(62) అనే వృద్ధుడు ఆదివారం మద్యాహ్నం ఇంటిలో ఉరేసుకుని మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలమేరకు.. మల్లప్ప కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడేవాడు. ఆసుపత్రిలో చూపించినా నయం కాలేదు. ఆదివారం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో తాళలేక ఉరేసుకుని మృతి చెందినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనుకొండ: పట్టణ శివారులోని శ్రీకృష్ణదేవరాయల కూడలిలో 44వజాతీయ రహదారి పై ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. పట్టణానికి చెందిన జికిరియా, సద్దాం ద్విచక్రవాహనంపై హిందూపురం నుంచి పెనుకొండకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

అగళి బైపాస్ వద్ద..

అగళి: అగళి బైపాస్‌లో జాతీయ రహదారిపై హనుమసపల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ ద్విచక్ర వాహనంపై వస్తూ రోడ్డు దాటుతుండగా నీలకంఠాపురం నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. 108 సాయంతో శిరా ఆస్పత్రికి తరలించారు. బెంగళూరు తరలించినట్లు అతడి అన్న ముద్దరంగప్ప తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

నీళ్లు పారితే.. సస్యశ్యామలమే..

లేపాక్షి, హిందూపురం గ్రామీణం, మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నిండుగా నీటితో కళకళలాడిన హంద్రీనీవా కాలువలు గడిచిన ఐదేళ్లలో అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం హయాంలో కంపచెట్లతో నిండి కళావిహీనంగా మారాయి. ఒక్కటంటే ఒక్క చెరువుకు నీరు వదిలిన దాఖలాలు లేవు. దీంతో ఆయకట్టు రైతులు పంటల సాగుకు నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాలువల ద్వారా నీటిని చెరువులకు వదలాలని


బయన్నపల్లి వద్ద కంపచెట్లతో హంద్రీనీవా కాలువ

ఐదేళ్లుగా కళావిహీనంగా హంద్రీనీవా కాలువలు

పలుమార్లు మంత్రులకు, అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. చేసేది లేక రైతన్నలు తమకున్న బోరుబావుల్లో నుంచి వచ్చే అరకొర నీటితో పంటలు సాగుచేస్తూ జీవనం సాగించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావడంతో కాలువలకు పూర్వ వైభవం వస్తుందని అన్నదాతలు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు.

హంద్రీనీవా కాలువ ద్వారా నీరు అందే చెరువులు, రైతులు, ఆయకట్టు వివరాలు

మండలం	చెరువులు	రైతులు	ఆయకట్టు (ఎకరాల్లో)
హిందూపురం	6	860	980
లేపాక్షి	9	2,120	2,450
మడకశిర	3	1,470	1,650

18 చెరువులు..5,080 ఎకరాలకు నీరు

2014లో తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యంగా హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీరందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇలా 2019 వరకు హిందూపురం గ్రామీణం, లేపాక్షి, మడకశిర గ్రామీణ మండలాల్లోని 18 చెరువులకు నీటిని అందించారు. ఈ నీటితో ఆయకట్టు రైతులు 5,080 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మిరప తదితర పంటలు సాగుచేసి ఆర్థికంగా బలపడ్డారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం కాలువలకు నీటిని వదలకుండా, కనీసం మరమ్మతులు చేయకుండా కాలాయాపన చేశారు. దీంతో చెరువులకు నీరు చేరక, బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటి రైతన్నలు దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు. ఈ విషయమై హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఏఈ నరేష్‌ను వివరణ కోరగా కాలువల లైనింగ్ చేపట్టేందుకు ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని అక్కడి నుంచి ఉత్తర్వులు రాగానే పనులు చేపడతామన్నారు.

ఏడు గ్రామాల్లో సమస్య ఉండేది కాదు



2018లో మడకశిర మండలంలోని హరేసముద్రం, మనూరు చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని నింపారు. ఆ నీటితో తనకున్న 2 ఎకరాల పొలంలో మొక్కజొన్న, వరి పంట సాగుచేసేవాడిని. చెరువుల్లో నీరు నిల్వ ఉండటంతో చుట్టుపక్కల ఏడు గ్రామాల్లో ఎటువంటి తాగునీటి సమస్య తలెత్తేదికాదు. ఐదుళ్లుగా చెరువులకు చుక్క నీటిని కూడా వదలక పోవడంతో ఆయకట్టు భూములన్నీ ఎక్కువ భాగం బీళ్లుగా మిగిలాయి. **- రామకిష్టప్ప, రైతు, హరేసముద్రం, మడకశిర మండలం**

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: పరిగిలోని షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. **-మూర్తి, పరిగి.**
సమాధానం: మరమ్మతులు చేయిస్తాం. **-అరుణ, కార్యదర్శి.**
సమస్య: ఊటకూరులో కాలువల్లో చెత్త పేరుకుపోయింది. **-ఆంజినేయులు**
సమాధానం: శుభ్రం చేయిస్తాను. **-దిలీప్‌కుమార్, సర్పంచి.**
–న్యూస్‌టుడే, పరిగి

సమస్య : రొద్దంలోని కళాశాలకు వెళ్లే రోడ్డులో గుంతలు పడి నీరు నిలిచింది. **-రవి, స్థానికుడు**
సమాధానం : రోడ్డుకు పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకొంటాం. **-గోవిందప్ప, పంచాయతీ కార్యదర్శి**
సమస్య : బూచెర్లలో పశ్చిమ రోడ్డులో మురుగు నిలిచింది. **-చంద్రమౌళి**
సమాధానం : సమస్య పరిష్కరిస్తాం. **-సోమిరెడ్డి, సర్పంచి**
–న్యూస్‌టుడే, రొద్దం

సమస్య: స్నేహలతా నగర్ రోడ్డులో మురుగు నిలుస్తోంది. **-సలీమ**
సమాధానం: చర్యలు చేపడతాం. **-రామాంజనేయులు, కార్యదర్శి, సోమందేపల్లి.**
–న్యూస్‌టుడే, సోమందేపల్లి

వీరశైవ సంఘం డైరెక్టర్లుగా ముగ్గురి ఎంపిక

అమరాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీరశైవ సంఘం డైరెక్టర్లుగా మడకశిర నియోజకవర్గంలోని అమరాపురం మండలానికి చెందిన ముగ్గురిని ఎంపిక చేశారు. అమరాపురం మండలం చిట్నడుకు గ్రామం నుంచి మంజునాథ్, అమరాపురం గ్రామం నుంచి హైటెక్‌బాబు, పి.ఎస్ మంజునాథ్‌లను ఎంపిక చేసినట్లు హైటెక్‌బాబు తెలిపారు.

ఒప్పంద ఉద్యోగులుగా మార్చాలని వినతి

పెనుకొండ, న్యూస్‌టుడే: మహాత్మా జ్యోతిబా పులే బీసీ గురుకుల పాఠశాలల్లో అతిథి ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న వారిని జీవో23 ప్రకారం ఒప్పంద ఉద్యోగులుగా మార్చాలని ఆసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. రవిచంద్రయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయులు నరసింహులు, ఓబులేసు, రమణారెడ్డి, అనితకుమారి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి సవితకు వినతి పత్రం అందజేస్తున్న ఎంజేపీ అతిథి ఉపాధ్యాయులు

వడ్డెర జాతిరత్నం ఓబన్న

హిందూపురం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య పోరాటంలో వీరోచితంగా పోరాడి ప్రాణాలు కోల్పోయిన వడ్డె ఓబన్న వారి సామాజిక వర్గానికి జాతి రత్నంగా నిలిచారని ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర అన్నారు. వడ్డె ఓబన్న వర్ధంతి సందర్భంగా ఆదివారం శ్రీకంఠపురంలోని అతని విగ్రహానికి ఆయనతో పాటు తెదేపా జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, తెదేపా నాయకులు, వడ్డెర సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించి అతని సేవలు కొనియాడారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు డీఈ రమేశ్‌కుమార్, 9వ వార్డు కౌన్సిలర్ మంజుళ, నాయకులు రంగప్ప, నవీన్, ప్రసాద్, వెంకటేశ్ పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర తదితరులు

ది. హిందూపూర్ కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ (R) 683

డి.నెం. 7-7-6, SVD రోడ్, హిందూపురం


సభ్యుల మహాసభ నోటీసు

పై స్టోర్స్ యొక్క సభ్యులందరికీ తెలియజేయడం ఏమనగా 19-10-24 తేది శనివారము ఉదయం 11 గంటలకు సొసైటీ బిల్డింగ్ నందు సర్వసభ్య సమావేశము జరుగులాగున స్టోర్స్ డైరెక్టర్స్ తీర్మానించినారు. కావున యావన్మంది స్టోర్స్ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావలెనని కోరుచున్నాము.

కార్యక్రమము

1) 2023-24 సంవత్సరము వ్యాపార కార్యకలాపాల గురించి సమీక్షించుట
2) స్టోర్స్ అభివృద్ధి గురించి చర్చించుట
3) హాజరైన సభ్యులు ఏ విషయమైనా చర్చించదలచినచో వారు వ్రాతమూలకముగా 5 రోజుల ముందు ప్రెసిడెంట్ గారి అనుమతి తీసుకొనవలసినది.
4) అధ్యక్షుల అనుమతితో ఇతర విషయములు చర్చించుట

Sd/- President
For the Hindupur Co-Op Stores Ltd., Hindupur


దర్బార్ మీనాక్షిదేవిగా హిందూపురం వాసవీమాత


సప్తఫణిమాతృకా దేవాలయంలో శాంతలక్ష్మిగా దుర్గామాత


శంకర మఠంలో గాజుల అలంకరణలో..


అమరాపురంలో చోళమాభదేవి


గోరంట్లలో అనంత పద్మనాభస్వామి అలంకరణలో..


సోమందేపల్లి: లక్ష్మీనరసింహ స్వామి అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి

శక్తి స్వరూపిణీ.. నమో నమామి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రూ. 51వేలతో వివిధ నోట్లను ఉపయోగించి ప్రత్యేకంగా అలంకరించారు. గాజుల, విత్తనాల అలంకారం ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు, నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. –న్యూస్‌టుడే బృందం


రొళ్లలో రత్నగిరి కాళికాంభదేవి


చంద్రగిరిలోని శ్రీగిరిమహేశ్వరీ శక్తిపీఠంలో నగదుతో అలంకరణ


చిలమత్తూరులో..

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా మా క్లయింటు శ్రీమతి లక్ష్మీదేవి భర్త: నారాయణప్ప, డోర్ నెం: 5-3-197, పులమిత రోడ్డు, శ్రీకంఠపురం, హిందూపురం. శ్రీ సత్యసాయి జిల్లా వాసులు. క్రింద తెలిపిన షెడ్యూలు దాఖలా ఆస్తిని బి.చిన్నరంగప్ప తండ్రి: బి.లింగప్ప, శ్రీకంఠపురం అనువారి నుండి Doc: 3171/97 గా SRD హిందూపురంలో రిజిష్టరు కాబడిన పత్రం ద్వారా కొనుగోలు చేసినారు. సదరి ఒరిజినల్ దస్తావేజు నెం. 3171/97ను పోగొట్టుకున్నారు అని తెలిపినారు. సదరి విషయమై హిందూపురం 2వ పట్టణ పోలీస్‌స్టేషను అధికారి గారికి ఫిర్యాదు చేసినారు. సదరు పోలీసు అధికారి గారు ఒరిజినల్ దస్తావేజు నెం: 3171/97 గుర్తించబడలేదు అని ధృవీకరించినారు. కనుక ఎవరికైనా పై తెలిపిన ఒరిజినల్ దస్తావేజు నెం. 3171/97 గుర్తించిన యెడల క్రింద తెలిపిన న్యాయవాదికి తెలుపగలరు. మరియు షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైననూ ఎటువంటి ఆక్షేపణలు గాని, ఎటువంటి తాకట్టు గాని, బ్యాంకు రుణములు గాని, కోర్టు వ్యవహారములు గాని ఉన్న యెడల క్రింద కనబరచిన చిరునామాకు 10 రోజుల లోపు తెలియజేయవలెను.

షెడ్యూలు

శ్రీ సత్యసాయి జిల్లా మరియు R.D మరియు హిందూపురం సబ్.డి.కి చెందిన శ్రీ కంఠపురం గ్రామ పొలంలో హిందూపురం మునిసిపల్ ఏరియాలో ఆస్తి వివరం.

బాబు	పార్టు	స.నెం.	య.సెం.	ప్లాటు నెం.
స.కుష్కి	I	479-4	2.96	ఈ పై ప్లాటు నెం-95
స.కుష్కి	I	480-3A	4.09	
స.కుష్కి	I	480-4A	0.04	

యిందుకు కొలతలు: తూర్పు-పడమర 40, ఉత్తర-దక్షిణ-30 అడుగులు, మొత్తం: 133.3 చ॥. **ఆస్తికి చెక్కుబందీ:** తూర్పు-20 అ॥ రోడ్డు, పడమర-30 అ॥ రోడ్డు, ఉత్తరం: ప్లాటు నెం: 16, దక్షిణం- ప్లాటు నెం.96. **ఇట్లు**

పి.వి.శ్రీనివాసరెడ్డి, అడ్వకేటు, డి.నెం. 26-4-1361, భవానిశంకర్ నగర్, మేళాపురం, హిందూపురం., సెల్: 9440746213

నిలిచిన నీరు.. పట్టించుకోరు

హిందూపురం పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే మేళాపురం సమీపంలో వ్యవసాయ చెక్‌పోస్టు కార్యాలయం వద్ద హిందూపురం-పెనుకొండ ప్రధాన రహదారి మీద వర్షం వస్తే చాలు నీరు నిలుస్తోంది. చిన్న పాటి చర్యలు తీసుకొంటే అక్కడ నీరు నిలిచే అవకాశమే ఉండదు. అయితే అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సమస్యను రహదారులు, భవనాల శాఖ ఏఈ మోహన్ దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపి పరిష్కరిస్తానని తెలిపారు. –న్యూస్‌టుడే, హిందూపురం పట్టణం



మట్టి రోడ్డుతో తప్పని అవస్థలు



గొల్లపల్లి, చిగతుర్పి మధ్యన ఉన్న మట్టి రోడ్డు రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వర్షం వస్తే చాలు రోడ్డు గుంతల్లో నీరు నిలిస్తున్నాయి. గుంతల్లో బైకులు, ఆటోలు, వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. అవస్థలు పడి బయటకు లాగి తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఉందని బీటీ రోడ్డును మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఎంపీడీఓ రామారావును వివరణ కోరగా ప్రతిపాదనలు వెళ్లాయని త్వరలో నిధులు మంజూరవుతాయన్నారు. –న్యూస్‌టుడే, గుడిబండ

ఆర్టీసీ ఆవరణలో మురుగు

హిందూపురం ఆర్టీసీ బస్టాండులోని హోటల్ నుంచి మురుగు బస్టాండు ఆవరణంలోని రహదారిపైకి వస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో దుర్వాసన వస్తోందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని ఆర్టీసీ సీఐ హంపన్న దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా వెంటనే హోటల్ నిర్వాహకుడికి విషయం తెలిపి రాకుండా చర్యలు తీసుకొంటామన్నారు. – న్యూస్‌టుడే, హిందూపురం



ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియ చేయడమేమనగా నా కక్షిదారుడైన **శ్రీ డా॥ B.L.కోదండ రామయ్య S/o B.C.లక్ష్మయ్య,** కస్తూరి నగర్, బెంగళూరు వారు క్రింద కనపరచిన షెడ్యూలు ఆస్తిని, సదరి యజమానులైన **శ్రీ U.ఆదినారాయణ S/o రామదాసు, బి.సత్యనారాయణరాజు S/o సేతురత్నంరాజు** మరియు **C.మోహనరాజు S/o కుప్పరాజు** అనువారితో క్రింద కనపరచిన ఆస్తిని కొనుగోలు విషయమై లావాదేవీలు చేయుచున్నాడు. ఈ విషయములో ఎవరికేని అభ్యంతరములున్న ఈ ప్రకటన చూచినవారు వారము రోజులలోపల సదరి ఆస్తిపై వారికున్న హక్కు విషయములో దస్తావేజులతో వ్రాతపూర్వకముగా తమ యొక్క హక్కు విషయమై క్రింద తెలిపిన అడ్రస్సుకు తెలుపుకొనవచ్చును. పై కాలవ్యవధిలోపు ఎటువంటి అభ్యంతరము తెలుపకున్న యెడల పై కనిన యజమానులకు పూర్తిహక్కు అనుభవము కలదని తలచి షెడ్యూలు ఆస్తి కొనుగోలు విషయమై లావాదేవీలు మా కక్షిదారుడు జరుపుకొనును.

షెడ్యూలు

Property situated R.D. of Sri Satya Sai S.R.D. of Chilamatturu within Village limits of Konduru.

	Govt Dry	S.No.	Extent
1.	"	8-2	A.C. 2.11 Paiki 1.90
2.	"	8-3	A.C. 1.84 Paiki 0.64
3.	"	9-1	A.C. 5.06 Paiki 2.32
4.	"	9-2A	A.C. 5.57 Paiki 0.89
5.	"	11-1	A.C. 1.46 Paiki 0.02
6.	"	11-2	A.C. 1.13 Paiki 0.03
7.	"	11-3	A.C. 1.58 Paiki 0.09
8.	"	11-4	A.C. 6.88 Full 0.18
9.	"	12-1	A.C. 3.40 Full
10.	"	12-2	A.C. 1.14 Full
11.	"	12-3	A.C. 3.33 Full
12.	"	2-4	A.C. 4.30 Paiki 3.59
13.	"	2-5	A.C. 1.21 Full
14.	"	12-6	A.C. 1.11 Full

B.S.రామిరెడ్డి, అడ్వకేటు
హిందూపురం. సెల్: 9441446445

ముద్దబంతి.. ముద్దైంది

అధిక వర్షంతో రైతన్నకు అపార నష్టం

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి యేడు మాదిరిగానే దసరా పండుగకు పంట కోతకు వచ్చే విధంగా రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లో రైతులు రెండు నెలల కిందట 200 ఎకరాల్లో ముద్ద బంతి సాగు చేశారు. ప్రస్తుతం పూలు కోసే సమయం. రెండు రోజుల్లో దసరా పండగకు పూలను మార్కెట్‌కు తరలించాల్సి ఉండగా అధిక వర్షం కారణంగా చెట్లు విరిగి నేలమట్టం కాగా మరికొన్ని చోట్ల పూలు రంగు మారాయి. పూలల్లో తేమశాతం అధికంగా ఉండడం, రంగు మారడంతో మార్కెట్‌కు తీసుకువెళ్లినా వాటిని కొనే వారు లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడెకరాల పంట నేలపాలు



మూడెకరాల పొలాన్ని రూ. 20వేలకు లీజుకు తీసుకుని అష్టగంధ రకం 25 వేల ముద్దబంతి నారు నాటాను. మదనపల్లి నుంచి రూ. 3ల చొప్పున కొనుగోలు చేశాను. నాటేందుకు, డ్రిప్పులు, ఎరువులు, కూలీల ఖర్చులు రూ. లక్ష వరకు వచ్చాయి. నాటిన 60 రోజులకు మంచి దిగుబడి వచ్చింది. తెలంగాణాలో జరిగే బతుకమ్మ, దసరా పండుగకు హైదరాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్దామనుకున్నాం. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి పూలలోకి నీరు చేరి బరువుకు చెట్లు విరిగి నేలన పడ్డాయి. మూడెకరాలలో 10 టన్నుల దిగుబడి నేలపాలైంది. ప్రస్తుతం స్థానికంగానే రూ. 60ల ధర ఉంది. రూ. 6లక్షల వరకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.
-శ్రీనివాస్, రైతు, కంబాలపల్లి, మడకశిర మండలం

రంగు మారింది



నాలుగెకరాల్లో సిరి రకం ముద్దబంతి పంటను సాగుచేశాను. 28 వేల మొక్కలు నాటాను. సాగు ఖర్చు రూ. 1. 50 లక్షలు వచ్చింది. మొదట విడతగా మూడు టన్నుల పూలు రూ. 50లతో స్థానికంగానే విక్రయించాను. మరో 5 టన్నులు దిగుబడి వచ్చేది. వర్షం కారణంగా పూలు రంగు మారాయి. తొలగించకుండా పొలంలోనే వదిలేశాం. సుమారు రూ. 3 లక్షల వరకు నష్టపోయాము. 15 ఏళ్లుగా ముద్దబంతి సాగుచేస్తున్నా. ఎప్పుడు ఇలాంటి పరిస్థితి రాలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.
-రమేశ్, రైతు, కంబాలపల్లి

నా దృష్టికి రాలేదు

వర్షానికి ముద్దబంతి దెబ్బతిన్నట్లు రైతులు తమ దృష్టికి తీసుకురాలేదు. దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.
-చిన్నరెడ్డయ్య, హార్టికల్చర్ ఏడీ, మడకశిర

మూడు రోజులుగా నిలిచిన నీటి సరఫరా

హిందూపురం పట్టణం: హిందూపురం పట్టణానికి నీటిని అందించే గొల్లపల్లి తాగునీటి పథకం మరోసారి అంతరాయాలు తలెత్తాయి. పట్టణానికి మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీటి పథకంలో శ్రీకృష్ణదేవరాయనగర్ వద్ద ఉన్న పంపింగ్ హౌస్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్యలు వచ్చాయి. రెండు రోజులుగా మున్సిపల్ నీటి సరఫరా విభాగం అధికారులు ప్రయత్నాలు చేస్తున్నా ఫలించలేదు. సోమవారం సైట్ మరమ్మతులు చేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు ప్రకటించారు. మంగళవారం నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. సోమవారం నాటికి మరమ్మత్తులు పూర్తయితేనే మంగళవారం నీరు వచ్చే అవకాశం ఉంది. లేదంటే కష్టమే.

వన్యప్రాణులను కాపాడుకుందాం

మడకశిర గ్రామీణం: వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీశాఖ అధికారి కుళ్లాయప్ప పేర్కొన్నారు. వన్యప్రాణుల వారోత్సవాలలో భాగంగా పాపసానిపల్లి, బేగార్లపల్లి, హొట్టేబెట్ట తదితర గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వన్యప్రాణుల దాడుల్లో పశువులు, మేకలు, గొర్రెలు తదితర ప్రాణులు చనిపోతే అటవీశాఖ ద్వారా పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. వాటిని చంపినా, హింసించినా శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ఎఫ్‌బీఓ విజయభాస్కర్, సంజీవరాయుడు, వైల్డ్‌లైఫ్ వాచర్ భీమప్ప పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

హిందూపురం గ్రామీణం : ఎం.బీరేపల్లి, మలుగూరు గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎ నిధులు రూ. 40లక్షలను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మంజూరు చేయించారు. ఈ మేరకు రెండు గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, తెదేపా నాయకులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.

కోటా సత్యంకు అభినందనలు

హిందూపురం అర్బన్ : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోటాసత్యం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జేపీకే రాము, కార్యదర్శి రవీంద్రుడు, కోశాధికారి శ్రీకాంత్, సహాధ్యక్షుడు ప్రకాష్, సభ్యులు పుట్టపర్తిలో ఆయన ఇంటికి వెళ్లి సత్కరించారు.

పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

నల్లబ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



ధర్మవరం : ధర్మవరం ఆర్టీసీ డిపోలో ఆదివారం ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఓవర్ టైమ్ డ్యూటీల శాతం ధర్మవరం డిపోలోనే అధికంగా ఉందని, పనిభారం పెరిగిందని పలుమార్లు డీఎంకు వినతులు అందించినా పరిష్కరించలేదని ఎంప్లాయీస్ యూనియన్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు కేబీ నాగార్జునరెడ్డి అన్నారు. సమస్యను పరిష్కరించకుంటే నిరవధిక ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు నరసింహులు, డిపో కార్యదర్శి ముస్తఫా, కమిటీ సభ్యులు బాబు, తిరుమలేశు, రామకృష్ణ, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా ప్రమోద్‌కుమార్



ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : ధర్మవరం మున్సిపాలిటీ కమిషనర్ మల్లికార్జున ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జమ్మలమడుగు కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. మల్లికార్జున గత వైకాపా హయాంలో మూడేన్నరేళ్లు ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ఆయన మున్సిపాలిటీ ఎన్నికల్లో తెదేపా నాయకులు కౌన్సిలర్లుగా పోటీ చేయకుండా అడ్డుకున్నారని, నామినేషన్ పత్రాలు చించేశారని వారు ఆరోపిస్తూ.. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టకూడదని డిమాండు చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇటీవల మూడుసార్లు ధర్నా చేశారు. అయితే బాధ్యతలు చేపట్టిన ఆయన తరువాత విధులకు హాజరుకాలేదు. తాజాగా ప్రభుత్వం ఆయన్ను ప్రొద్దుటూరుకు బదిలీ చేసింది.

వడ్డెర్లకు ఆరాధ్యుడు ఓబన్న

కొత్తచెరువు, న్యూస్‌టుడే : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న వర్ధంతి సందర్భంగా కొత్తచెరువులో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. పుట్టపర్తి రోడ్డులోని వడ్డె ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వడ్డెర్లకు ఓబన్న ఆరాధ్యుడని కొనియాడారు. స్వాతంత్రోద్యమంలో ఆయన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఓబన్న విగ్రహం వద్ద వడ్డెర కులస్తులు

చౌడేశ్వరీదేవికి పట్టుచీరల బహూకరణ

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరంలోని చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయాలకు ఆదివారం తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు రాము పట్టుచీరలను బహూకరించారు. దేవీనవరాత్రుల సందర్భంగా అమ్మవార్లకు పట్టుచీరల అలంకరణ చేసేందుకు ఆలయాలకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పుల్లయ్య, తెదేపా పట్టణ అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.



పట్టుచీరను సమర్పిస్తున్న తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు గుద్దిటి రాము

దారంతా గుంతలు.. చోదకులకు తిప్పలు

ముదిగుబ్బ మండలంలోని రాళ్లఅనంతపురం క్రాస్ నుంచి కొడవండ్లపల్లికి వెళ్లే మార్గం అధ్వానంగా మారింది. రాళ్లఅనంతపురం క్రాస్ దగ్గర కల్వర్టు పూర్తిగా శిథిలం కావడంతో రాకపోకలకు ఆటోలు, ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్లుగా ఆ క్రాస్ నుంచి మలుపు వరకు రోడ్డు నిర్మించకపోవడంతో దారి దారుణంగా తయారైంది. అడుగులోతు గుంతలు పడిన అధ్వానంగా ఉన్న మార్గంలో ఇసుక టిప్పర్లు, కంకర లారీలు అధిక బరువుతో వెళ్లడంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే వాహనచోదకులు నరకయాతన పడుతున్నారు. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ముదిగుబ్బ**



తాగునీటికి కటకట

తలుపుల ప్రకాశ్‌నగర్‌లో విద్యుత్తు నియంత్రిక మరమ్మతుల కారణంగా, రెండు రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. మరో ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో తాగునీటికి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్‌తో నీరు సరఫరా చేస్తుండటంతో ప్రజల అవసరాలు తీరడం లేదు. అధికారులు స్పందించి విద్యుత్తు నియంత్రికకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను తలుపుల పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌మునాఫ్ దృష్టికి తీసుకెళ్లగా కాలనీకి అవసరమైనన్ని నీరును ట్యాంకర్లతో సరఫరా చేస్తామన్నారు. విద్యుత్తు నియంత్రిక మరమ్మతులు పూర్తి కాగానే కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు. **- న్యూస్‌టుడే, తలుపుల**



వానొస్తే ఇంతేనా?

కొత్తచెరువులో వర్షం కురిసిందంటే రోడ్లపై మురుగు పారుతోంది. డ్రైనేజీల్లో పూడికతో మురుగు ప్రవాహం ముందుకు సాగక ఈ పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. శనివారం శిరిడిసాయి దేవాలయం ఎదురుగా సీసీ రోడ్డుపై మురుగు నిలబడి ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. సమస్యను కార్యదర్శి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా డ్రైనేజీల్లో పూడిక తొలగించి రోడ్డుపై మురుగు నిలబడకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, కొత్తచెరువు



భయం భయంగా ప్రయాణం



కోవెలగుట్టపల్లి - పుట్టపర్తికి మధ్యలో చిత్రావతినదిపై కాజ్‌వే నిర్మించారు. కాజ్‌వేకు ఏర్పాటు చేసిన రక్షణ పిల్లర్లు ధ్వంసం కావడంతో ప్రమాదాలను సూచిస్తోంది. ముందే మలుపు ఆపై కాజ్‌వేకు రక్షణ స్తంభాలు లేకపోవడంతో ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల్లో వెళ్లే వారు భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఏమాత్రం అదుపు తప్పినా 20 అడుగుల లోతు చిత్రావతి నదిలోకి దూసుకుపోవడం ఖాయం. ప్రాణాలు గాలిలో కలిసి పోయే ప్రమాదం పొంచి ఉందని రక్షణ పిల్లర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పుట్టపర్తి గ్రామీణం

ఆత్మగౌరవానికి ప్రతీకగా జెండా ఎగురేద్దాం

కదిరి, న్యూస్‌టుడే : ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రతి మాదిగ ఉద్యోగి పల్లెలకెళ్లి దండోరా జెండా ఎగురేయాలని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం కదిరిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు చేపట్టే కార్యక్రమాలను వివరించారు. ఎంఈఎఫ్ నాయకులు ఆనంద్, శ్రీనివాసులు, చిన్నప్పయ్య, నాగప్ప, వేమనారాయణ, కిష్టప్ప, శివనాథ్, ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ విశ్వనాథ్, నాగరాజు, నరసింహులు పాల్గొన్నారు.

ముగ్గురు ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరం ఒకటో పట్టణ ఎస్‌ఐలుగా కె.గోపీకుమార్, కె.మహమ్మద్‌రఫి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. పుట్టపర్తి వీఆర్ నుంచి వీరు బదిలీపై ధర్మవరం 1వ పట్టణ పోలీసుస్టేషన్‌కు బదిలీపై వచ్చారు. 2వ పట్టణ ఎస్‌ఐగా కె.శ్రీరాములు బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన వీరు 2వ పట్టణ సీఐ, 1వ పట్టణ ఇన్‌ఛార్జి ఎస్‌ఐ రెడ్డెప్పను కలిశారు.

నేటి ర్యాలీ విజయవంతానికి పిలుపు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : పాలస్తీనా దేశంపై ఈ నెల 7వ తేదీ ఇజ్రాయిల్ జరిపిన దాడిలో 42 వేల మందికిపైగా పాలస్తీనా ప్రజలు మరణించారని సీపీఎం మండల కార్యదర్శి పెద్దన్న ఆవేదన వ్యక్తం చేశారు. కాల్పుల విరమణ కోరుతూ ముదిగుబ్బలో ఈ నెల 7వ తేదీ సోమవారం నిర్వహించే ర్యాలీలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భాజపా సభ్యత్వ నమోదు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసమే సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నామని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమల ప్రకాశ్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం ముదిగుబ్బలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, నాగభూషణ, చంద్రశేఖర్, అనీఫ్, రాములు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

స్క్రూడ్రైవర్‌తో దాడి

ధర్మవరం : కేతిరెడ్డి కాలనీలో షేక్ హుస్సేన్‌పీరాపై అదే కాలనీకి చెందిన మునిరత్నం శనివారం రాత్రి స్క్రూడ్రైవర్‌తో దాడి చేశాడు. గాయపడిన అతన్ని స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తన ఇంటి వద్దకు వచ్చిన మునిరత్నం మద్యం మత్తులో మహిళలను దూషిస్తుండటంతో హుస్సేన్‌పీరా ప్రశ్నించారు. దీంతో స్క్రూడ్రైవర్‌తో తనపై పలుమార్లు దాడి చేసి పొడిచాడని ధర్మవరం 2వ పట్టణ పోలీసులకు మునిరత్నంపై హుస్సేన్‌పీరా ఫిర్యాదు చేశారు. 2వ పట్టణ సీఐ రెడ్డెప్ప కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నారు.

చేనేత కార్మికులకు గాయాలు

ధర్మవరం : ధర్మవరంలోని 1వ పట్టణ పోలీసు స్టేషన్ కూడలి వద్ద ఆదివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు చేనేత కార్మికులు గాయపడ్డారు. సిద్దయ్యగుట్ట కాలనీకి చెందిన జయరాం, నాగరాజు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై పట్టణంలోకి వచ్చి తిరిగి వెళుతుండగా కారు ఢీకొంది. గాయపడిన ఇద్దరిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రమాదంలో జయరాంకు తీవ్రగాయాలు కావడంతో అతన్ని మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 1వ పట్టణ పోలీసులు వివరాలు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

రబీ పంటల సాగు లేనట్టే..

● రిజర్వాయర్ పేరిట చెరువు కట్ట తొలగింపు ఫలితం

నల్లమాడ, న్యూస్‌టుడే: రిజర్వాయర్ నిర్మిస్తున్నాం.. మీ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్నామంటే భవిష్యత్తు తరాలు బాగుంటాయని భూములు పోయినా ఫర్వాలేదని ఎంతో మంది అన్నదాతలు ముందుకు వచ్చారు. చకచకా రిజర్వాయర్ పనులు పూర్తి చేసేస్తామంటే సంబరపడిపోయారు. ఇందులో భాగంగా చెరువు కట్టను తొలగించినా ఏ అభ్యంతరమూ చెప్పలేదు. ఇప్పుడదే రైతన్నలకు శాపంగా మారింది. రిజర్వాయర్ నిర్మాణ పనులమాట అటుంచితే కట్ట తొలగించడంతో చెరువులో చుక్కనీరు లేక భూగర్భ జలాలు అడుగంటి పంటల సాగు కష్టతరంగా మారింది.



ఎన్.ఎనుములవారిపల్లి వద్ద రిజర్వాయర్ ఏర్పాటుకు చెరువు కట్టను తెంపేసిన ప్రాంతం

అడుగంటుతున్న భూగర్భ జలాలు

నల్లమాడ మండలం ఎన్.ఎనుములవారిపల్లి వద్ద చెరువు కట్టను వైకాపా ప్రభుత్వ హయాంలో తొలగించేశారు. నూతన రిజర్వాయర్ నిర్మించకపోగా చెరువు కట్ట కూడా లేకపోవడంతో చెరువలోకి వస్తున్న నీరంతా వృథాగా పోతోంది. ఎన్.ఎనుములవారిపల్లి, చంద్రాయునిపల్లి, తిప్పయ్యగారిపల్లి గ్రామాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వందల ఎకరాల సాగు భూముల్లో భూగర్భ జలాలకు ఆధారమైన చెరువులో చుక్కనీరు లేకపోవడంతో రబీ కింద పంటలు సాగు చేసుకోవడానికి తీవ్ర సమస్యగా మారింది. రిజర్వాయర్ సంగతి దేవుడెరుగు కనీసం చెరువు కట్టయినా ఉండి ఉంటే భూగర్భ జలాలు అడుగంటిపోకుండా ఉండేవని రైతులు వాపోతున్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

నల్లచెరువు (కదిరి) : మానవ ప్రపంచంలో సమానంగా ప్రాణులు కలిగిన వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతని ఫారెస్టు బీట్ ఆఫీసర్లు తెలిపారు. నల్లచెరువు మండలం దామవాండ్లపల్లిలో ఆదివారం సాయంత్రం వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా వన్యప్రాణులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వన్యప్రాణులకు జీవించే హక్కు ఉందని తెలిపారు. వాటిని వేటాడటం చట్టరీత్యా నేరమని తెలిపారు. నాన్‌బెలబుల్ కేసులు నమోదు అవుతాయని పేర్కొన్నారు. వన్యప్రాణులను కాపాడటం బాధ్యతగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో అటవీ బీట్ ఆఫీసర్లు జేసీ వెంకటేశ్వర్లు, ఆర్.హరిప్రసాద్, జి.అనిల్‌కుమార్, వి.నాగరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య : ఉప్పలపాడులోని ప్రధాన రహదారిపై నిత్యం మురుగు నిలుస్తోంది. దిగువ ప్రాంతానికి వెళ్లే కాలువలో పూడిక పేరుకుపోవడంతో మురుగు ముందుకు కదలడంలేదు. **- గ్రామస్థులు**

సమాధానం : పూడిక తొలగించి మురుగు నిల్వలేకుండా శుభ్రం చేయిస్తాం. **- సర్పని, పంచాయతీ కార్యదర్శి**

సమాధానం : శీలంవాండ్లపల్లిలో పంచాయతీ మోటారు పనిచేయక తాగునీటి సమస్య నెలకొంది. **- రమణయ్య, రైతు**

సమాధానం : బోరు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య తీరుస్తాం. **- ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ**

సమస్య : దొరిగల్లు నుంచి ఇందుకూరు, మర్తాడు గ్రామానికి వెళ్లే మార్గంలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల్లో కంపచెట్లు విపరీతంగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. **- గ్రామస్థులు**

సమాధానం : మలుపుల్లో కంపచెట్లు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- పోలమ్మ, పంచాయతీ కార్యదర్శి**

సమస్య : ముదిగుబ్బలోని పాత పోస్టాఫీసు వీధి, సాయినగర్, టీచర్స్ కాలనీల్లో చెత్త రోడ్డుపై కుప్పలుగా వేయడంతో దుర్వాసన వస్తోంది. **- కృష్ణ, ముదిగుబ్బ**

సమాధానం : చెత్త ఎప్పటికప్పుడే తొలగించేలా పారిశుద్ధ్య సిబ్బందికి సూచిస్తాం. **- చంద్రాయుడు, ముదిగుబ్బ సర్పంచి**

– న్యూస్‌టుడే, ముదిగుబ్బ

క్రికెట్‌లో ధర్మవరం జట్టు విజయం



తేజేశ్వరరెడ్డి మైత్రి లోక్‌నాథ్

ధర్మవరం పట్టణం: జిల్లా క్రికెట్ అసోసియేషన్, ఆర్డీటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న రూరల్ క్రికెట్ లీగ్‌లో సంచలనం నమోదైంది. ఆదివారం అండర్-15 విభాగంలో ధర్మవరం, బుక్కరాయసముద్రం జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు 40 ఓవర్లలో 317 పరుగులు సాధించింది. తేజేశ్వరరెడ్డి సెంచరీతో కదంతొక్కాడు. 105 బంతుల్లో 132 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన బుక్కరాయసముద్రం జట్టు 12.4 ఓవర్లకు 19 పరుగులకే ఆలౌట్ అయింది. ధర్మవరం జట్టులోని మైత్రి, లోక్‌నాథ్ చెరో 4 వికెట్లు పడగొట్టారు.

చెస్ పోటీలకు పూజిత ఎంపిక



ధర్మవరం: ధర్మవరం చెందిన చెస్ క్రీడాకారిణి ఎ.పూజిత సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైంది. ఆమె నవంబరులో తమిళనాడులోని లా యూనివర్సిటీలో జరిగే ఆ పోటీల్లో పాల్గొననుంది. పూజిత అనంతపురంలోని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 4వ సంవత్సరం చదువుతోంది. ఆమెను ధర్మవరం బీఎస్‌కే చెస్ అకాడమీ చీఫ్ కోచ్ ఆదిరత్నకుమార్ అభినందించారు.

క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి

కదిరి, న్యూస్‌టుడే : పోటీల్లో క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 9 నుంచి గుంటూరులో రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సీనియర్ ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. క్రీడాకారులంతా శిక్షణను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ క్లబ్ కార్యదర్శి కె.ఎస్.సిరాజుద్దీన్, ఉపాధ్యక్షుడు నిజాముద్దీన్, పీఎం బాషా, కోచ్ ఇర్షాద్‌అలీ, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పరుగులో ఎమ్మెల్యే ప్రథమం

ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే తన బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. దేహదారుఢ్యం (ఫిట్‌నెస్)లో ఎవరి సామర్థ్యమెంతని ఆయన తెచ్చిన ప్రస్తావనతో 30+, 40+, 50+ వయసుల వారీగా పరుగు పోటీ నిర్వహించారు. తనకంటే వయసులో చిన్న, సమానంగా ఉన్న వారితో ఎమ్మెల్యే పరుగులో పోటీ పడి ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయన దేహదారుఢ్య సామర్థ్యాన్ని చూసి అందరూ ఆశ్చర్యంచెందారు.



పరుగులో పోటీ పడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ఆరోగ్యానికి ధ్యానం దోహదం

పుట్టపర్తి, న్యూస్‌టుడే : నేటి పోటీ ప్రపంచంలో మానసిక ఒత్తిడిని జయించాలంటే ధ్యానం ఎంతో అవసరమని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వాసవీ నివాస్‌లో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ధ్యాన మందిరం శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే ధ్యానం తప్పనిసరిగా ప్రతి మనిషి ఆచరించాలని సూచించారు. వాసవీ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న ఉపాధ్యాయులు, పేద విద్యార్థులకు వస్త్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పల్లెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్దానాగేశ్వరరావు, కోటా సత్యం, నాయకులు బాలకృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయినికి వస్త్రాలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

వరద బాధితులకు ప్రజల అండ

పుట్టపర్తి, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితులకు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పిలుపుతో పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలు 71 టన్నులు ఆహార ధాన్యాలు, రూ.25 లక్షల నగదును మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి అందజేశారు. ఆదివారం సాయంత్రం పట్టణంలో సత్యమ్మ ఆలయం వద్ద నుంచి ఆహార ధాన్యాన్ని విజయవాడకు తీసుకెళ్తున్న వాహనాలకు ఆయన జెండా ఊపి సాగనంపారు. వరద బాధితులకు అండగా నిలిచిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం విజయవాడలో వాటిని అందజేయనున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై అప్రమత్తంగా ఉండాలని కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి అన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా నేరగాళ్లు అనుసరిస్తున్న తీరు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ఆదివారం అర్బన్ సీఐ నారాయణరెడ్డితో కలిసి విడుదల చేశారు. సామాజిక మధ్యమాలను వేదికగా తీసుకుని ప్రజల్లో ఆశలు రేకెత్తించేలా లింకులు పంపడం, ఫోన్‌చేసి వ్యక్తిగత వివరాలు అడగటం ద్వారా జనాన్ని వంచిస్తున్నారు. అపరిచితులు పంపిన లింకులను ఎట్టిపరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దని డీఎస్పీ సూచించారు. ఖాతాదారుడి ప్రమేయం లేకుండానే బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు డెబిట్ అయిన సమయంలో గంటలోపు 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడం ద్వారా డబ్బులు మోసగాళ్లకు చేరకుండా ఫ్రీజ్ చేసి బాధితుల ఖాతాకు క్రెడిట్ చేసే అవకాశం ఉంటుందన్నారు.



ధర్మవరం : గాయత్రీదేవిగా కన్యకాపరమేశ్వరి



ధర్మవరం : మధుర మీనాక్షిగా గాంధీనగర్ చౌడేశ్వరీదేవి



చెన్నేకొత్తపల్లి: న్యామద్దలలో ధనలక్ష్మిగా మహేశ్వరి



కదిరి :నాగిరెడ్డిపల్లిలోని ఆలయంలో చౌడేశ్వరి



కొత్తచెరువు : లలితాదేవిగా పెద్దమ్మ

అమ్మ అలంకారం.. నయనానందకరం




బుక్కపట్నం: వాసవీమాత



బత్తలపల్లి : దుర్గామాత

పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లోని అమ్మవారి దేవాలయాల్లో దసరా నవరాత్రులను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. అమ్మవారి నామస్మరణ మార్మోగింది. విద్యుత్తు దీప కాంతులతో ఆలయాలు వెలుగులీనుతున్నాయి. **- న్యూస్‌టుడే బృందం**

కదిరి : రామావతార అలంకారంలో శ్రీఖాద్రీనృసింహస్వామి →



రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానాచార్యులు రమేశ్‌బాబు తెలిపారు. ఇటీవల అనంతపురంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్-14 విభాగం హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థినులు ఓంశ్రీ, ఫర్హాన్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో అనంతపురం జిల్లా జట్టుతరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.



విద్యార్థినులు ఓంశ్రీ, ఫర్హాన్

● రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎనుములపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు హర్షిత, స్నేహస్వరూప, నందిని సాయిచంద్ర ఎంపికైనట్లు హెచ్‌ఎం సుధాకర్ తెలిపారు. పెదపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి జిలాన్‌బాషా అండర్-17 వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, పీడీలు, ఉపాధ్యాయులు సుధాకర్, అజీంబాషా, రమేశ్‌బాబు, వెంకటేశు, చెన్నకృష్ణారెడ్డి, సూర్యనారాయణ సోమశేఖర్‌రాజు అభినందించారు.



పెదపల్లి: విద్యార్థి జిలాన్ బాషాతో ఉపాధ్యాయులు



ఎనుములపల్లి విద్యార్థులతో ఉపాధ్యాయులు

కరాటేలో సత్తాచాటిన చిన్నారులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : కరాటే శిక్షణతో శారీరక దృఢత్వమే కాకుండా, ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని మాంగళ్య సిల్క్ అధినేత పురుషోత్తం, సీనియర్ కరాటే మాస్టర్ అక్బర్ అలీ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలిక ఉన్నత పాఠశాలలో కరాటే పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఎల్లో, గ్రీన్, పర్పుల్ బెల్ట్‌లు, ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయి కరాటే ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య పాఠశాల కరస్పాండెంట్ జనార్దన్, కరాటే మాస్టర్ ఇనాయత్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే : మండలంలోని తంగేడుకుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో 2006-07 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఎంఈఓ జయచంద్రారెడ్డి, నాటి ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, జనార్దన్, రవికుమార్, రమేశ్. మధు, కరుణకర్‌రెడ్డిని ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ప్రమీల, కౌశిక్, వెంకటరమణ, మురళి, నరసింహయ్య, అశ్వని, గుణవతి తదితరులు పాల్గొన్నారు.



గౌనిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు